సాక్షి నిర్మల్

మంగళవారం । 30 । జూలై । 2024



ప్రజల చెంతకే 'పోస్ట్'

దేశంలోనే అతి పెద్ద నెట్‌వర్క్‌గా పనిచేస్తున్న పోస్టల్ శాఖ నాలుగైదేళ్లుగా అనేక పథకాలను ప్రవేశపెట్టింది. పేద, మధ్య తరగతి ప్రజల ఆదరణ పొందుతున్నాయి. 10లో▸



సాగు లెక్క ఇక పక్కా

రైతులకు గిట్టుబాటు ధర అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పంటల సర్వే చేపడుతోంది. నియంత్రిత సాగు విధానాన్ని అమల్లోకి తెచ్చింది. 11లో▸

గరిష్టం/కనిష్టం
31.1 /25.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతు పవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలి



దిలావర్‌పూర్‌లో దీక్ష చేస్తున్న నాయకులు చిన్నారెడ్డి, రాజారెడ్డి తదితరులు

దిలావర్‌పూర్: మండల కేంద్రమైన దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని నిలిపివేయాలని గుండంపల్లి గ్రామానికి చెందిన నాయకులు చిన్నారెడ్డి, రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని దిలావర్‌పూర్ బస్టాండ్ ప్రాంతంగా చేస్తున్న దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. దీక్షాశిబిరంలో వారు మాట్లాడుతూ తమ పరిసర గ్రామాలన్నీ ఎప్పుడూ పచ్చని పంటచేలతో కళకళలాడుతాయని తెలిపారు. ఇథనాల్ ఫ్యాక్టరీని నిర్మించి తమను కాలుష్యం కోరల్లోకి నెట్టొద్దని కోరారు. ఫ్యాక్టరీ పనులు నిలిపేసే వరకు నిరసన దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో అనిత

కడెం: పులుల సంరక్షణ మనందరి బాధ్యతని ఎఫ్ఆర్వో అనిత అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా కడెం, ఉడుంపూర్ రేంజ్ అటవీ అధికారులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. పులులను సంరక్షించాలని ప్లకార్డులు పట్టుకుని నినాదలు చేశారు. ర్యాలీలో ఉడుంపూర్ రేంజ్ అధికారి శంకర్, డీఆర్వోలు ప్రకాశ్, కవిత, ఎఫ్‌బీవోలు అలీం, రవి, అరుణ్, ముత్తన్న, శివకుమార్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ భవనం శిలాఫలకం ధ్వంసం



శిలాఫలకం వద్ద యూటీఎఫ్ నాయకులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ఓ ఉపాధ్యాయ సంఘ భవన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. 2008లో అప్పటి పార్లమెంటు సభ్యుడిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు. దీని కోసం అప్పట్లో శిలాఫలకం ఏర్పాటు చేయగా గుర్తుతెలియని వ్యక్తులు దానిని ధ్వంస చేశారు. సోమవారం సంఘం సభ్యులు గుర్తించారు. శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని టీఎస్ యూటీఎఫ్, టీయూటీఎఫ్ సంఘాల జిల్లా బాధ్యులు దాసరి శంకర్, పెంట అశోక్, తొడిశెట్టి రవికాంత్, వహీద్‌ఖాన్, బక్కన్న, నాగయ్య, రవి కిరణ్, భీమయ్య, గోవర్ధన్‌రావు, వేణుగోపాల్ తదితరులు డిమాండ్ చేశారు.

ఐఐటీకి రంజని తండా విద్యార్థి



రాథోడ్ రవికిరణ్

కుభీర్: మండలంలోని రంజని తండాకు చెందిన రాథోడ్ రవికిరణ్ అసోం రాష్ట్రం గౌహతిలోని ఐఐటీలో సీటు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయస్థాయిలో 161 ర్యాంకు సాధించాడు. దీంతో గౌహతి ఐఐటీలో సీటు వచ్చింది. రవికిరణ్ 7వ తరగతి వరకు భైంసాలోని వాసవి పాఠశాలలో చదవగా 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లోని కార్పొరేట్ కళాశాలలో చదివాడు. రవికిరణ్ తల్లి అంగన్‌వాడీ కార్యకర్త, తండ్రి ఉపాధిహామీలో సీసీగా పనిచేస్తున్నారు. మారుమూల తండాలో పుట్టి ఐఐటీలో సీటు సాధించిన రవికిరణ్‌ను గ్రామస్తులు అభినందించారు.

'కడెం'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



కడెం: జిల్లాలోని ప్రధాన జలాశయం కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ప్రాజెక్టుకు 4,723 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, అధికారులు ఒక వరద గేటు ఎత్తి 4,311 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603)అడుగులు కాగా, ప్రస్తుతం 695.25(6.426టీఎంసీ) అడుగులు ఉంది.



పోలీసులు పట్టుకున్న గంజాయి పొడి

ఈనెల 26న గంజాయితో పట్టుబడ్డ నిందితుడితో ముధోల్ పోలీసులు(ఫైల్)

గుట్టుగా.. గంజాయ్!

- సరిహద్దులు' దాటుతున్న మత్తు
- పొరుగు రాష్ట్రం నుంచి జిల్లాకు..
- జిల్లాలో జోరుగా గంజాయి విక్రయాలు..
- విద్యా సంస్థ సమీపంలో అడ్డాలు..
- పొరుగు జిల్లాలకూ ఇక్కడి నుంచే..

భైంసా: జిల్లాను గంజాయి మత్తు వదలడం లేదు. ఏళ్లుగా విక్రయాలు సాగుతుండగా, వాటికి బానిసై యువత బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకుంటోంది. తల్లిదండ్రులు కష్టపడి విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకుడవుతాడని భావిస్తే గుట్టుగా గంజాయి చేవిస్తూ మత్తులో జోగుతున్నారు. జులాయిగా తిరుగుతున్నారు. జిల్లా మహారాష్ట్ర సరిహద్దున ఉండడంతో పొరుగు రాష్ట్రం నుంచి గంజాయి సరి'హద్దులు' దాటి జిల్లాకు చేరుతోంది. నిఘా వ్యవస్థ కళ్లు కప్పి గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిర్మల్ జిల్లాను గంజాయి రహితంగా చేయాలని ఎస్పీ జానకీషర్మిల ఇటీవలే పోలీసులను ఆదేశించారు. భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ డివిజన్ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. సరిహద్దు ప్రాంతాలపై నిఘా ఉంచాలని సూచించారు. దీంతో సరిహద్దు ప్రాంతంలో దృష్టిపెట్టిన ముధోల్ సీఐ మల్లేశ్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి నిఘా పెంచారు. ఈ క్రమంలో ఈనెల 26న ముధోల్ ఎస్సై సాయికుమార్, బాసర ఎస్సై గణేశ్ సిబ్బందితో బృందంగా ఏర్పడి నిఘా పెట్టారు. అదే రోజు ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద అనుమానిత వ్యక్తి కనిపించాడు. ముధోల్ ఎస్సై సాయికిరణ్ అక్కడికి చేరుకుని తనిఖీ చేయగా అతడి వద్ద 12 చిన్న ప్యాకెట్లలో ఉన్న గంజాయిని పట్టుకున్నారు. నిందితుడిని విచారణ చేయగా.. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపాడు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ఇమామియా సయ్యద్ దిల్దర్‌అలీ నుంచి గంజాయి సరఫరా అయినట్లు గుర్తించారు. భైంసా పట్టణంలోని ఓవైసీనగర్‌కు చెందిన షేక్ అహ్మద్ ద్వారా గంజాయి విక్రయిస్తున్నట్లు తేల్చారు. వీరి నుంచి 443 గ్రాముల గంజాయి, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

రైలు మార్గం ద్వారా...

మహారాష్ట్ర నుంచి తెలంగాణను కలుపుతూ బాసర నుంచి వెళ్లే రైలుమార్గంలోనూ గంజాయి అక్రమంగా సరఫరా అవుతుంది. ప్యాసింజర్ రైళ్లలో రద్దీగా ఉండే బోగిల్లో సంచుల్లో గంజాయి కుక్కి పైన పాతబట్టలు పెట్టి తెలంగాణలోని పలు జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. మహారాష్ట్రవైపు నుంచి వచ్చే ప్రైవేటు వాహనాల్లోనూ గంజాయి వస్తుందని వినిపిస్తుంది. బాసర, ముధోల్, కుభీర్, కుంటాల, సారంగాపూర్, మహారాష్ట్రకు సరిహద్దు మండలాలుగా ఉన్నాయి. ఈ మండలాల్లోని చాలా గ్రామాలకు మహారాష్ట్ర కలిపే రహదారులు ఉన్నాయి. గుట్టలు దాటి ద్విచక్రవాహనాలపై గంజాయిని జిల్లాలోకి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. యువకులను గంజాయికి బానిసచేస్తున్నారు. ఒక్కరోజులోనే 443 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇంటి ఆవరణల్లోనే...

మహారాష్ట్రలో ఇరుకైన ఇళ్లలో, ఎవరూ వెళ్లని చోట రేకులు అడ్డుగా ఉంచి గంజాయి మొక్కలు పెంచుతున్నారు. ఎదిగిన తర్వాత గంజాయిని ఎండబెట్టి చిన్నచిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నారు. పర్భనీ జిల్లా నుంచి ఓ ముఠా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నాందేడ్ సమీప ప్రాంతాల్లో నుంచి కూడా గంజాయిని సరఫరా చేస్తున్నట్లు ఇటీవలే పట్టుబడ్డ వ్యక్తులు తెలిపారు. చాలా రోజులుగా మహారాష్ట్ర నుంచే గంజాయి వస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఎక్కడి నుంచి సరఫరా అవుతుందో వివరాలు తెలుసుకున్నారు. నాందేడ్, పర్భనీ ప్రాంతాల నుంచి సరిహద్దు ధర్మాబాద్‌కు సరఫరా అవుతుంది. అక్కడి నుంచి ప్యాకెట్లలో నింపి మన ప్రాంతంలో విక్రయిస్తున్నారు. ముందుగా కొంత మంది యువకులతో ఒప్పందం చేసుకుని వారికే గంజాయిని విక్రయిస్తున్నారు. గంజాయి సేవించేవారు పెరగడంతో సరఫరాపై పోలీసులు దృష్టిపెట్టారు.

విద్యా సంస్థల్లోనూ...

పలు విద్యాసంస్థల్లో యువకులకు గంజాయి అలవాటు చేసిన ఈ వ్యక్తులు నేరుగా వారికి విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. మహారాష్ట్రవైపు నుంచి పంట పొలాల్లో ఉన్న దారుల్లో వచ్చి విక్రయిస్తున్నారు. ఇటీవలే ప్రముఖ విద్యాసంస్థలో చదివే విద్యార్థులు హైదరాబాద్‌లో గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. ఇలా గంజాయి సేవిస్తూ ఎంతో మంది పట్టుబడుతున్నారు. యాంటీనార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్‌శాండిల్యా పలు ప్రముఖ కళాశాలల్లో గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ వారి వివరాలను ఇటీవలే వెల్లడించారు. ఇందులో మన జిల్లాలోని ప్రముఖ కళాశాల విద్యార్థులు కూడా ఉన్నారు. చాలా మంది విద్యార్థులు గంజాయికి అలవాటుపడ్డారు. జిల్లాలోని కళాశాలల్లో చదివే యువకులకు మత్తుకు అలవాటుచేసేలా గంజాయి విక్రయదారులుపావులు కదుపుతున్నారు. గుట్టుచప్పుడుకాకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

కఠిన చర్యలు..

గంజాయికి అలవాటు పడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలి. చెడు వ్యసనాలకు దూరంగా ఉంచాలి. యువత మత్తుకు చిత్తుకాకుండా ఆదర్శంగా నిలవాలి. గంజాయి సేవిస్తున్నవారి వివరాలు మా వద్ద ఉన్నాయి. అలాంటి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తాం. గంజాయి పండించినా.. బయటి నుంచి తెచ్చి అమ్మినా కఠిన చర్యలు తప్పవు. ఎస్పీ జానకిషర్మిల ఆదేశాలతో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఎక్కడైనా గంజాయి వినియోగించినా.. విక్రయించినా జిల్లా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఏ సమాచారం ఉన్న 8712659555, 8712659599 నంబర్లకు తెలపాలి.

– అవినాష్‌కుమార్, ఏఎస్పీ, భైంసా

ఇక 'స్థానిక' సమరం!?

- ఓటరు జాబితా సిద్ధం చేయాలని సీఎం ఆదేశం
- పంచాయతీ ఎన్నికలకు అధికారుల కసరత్తు
- గ్రామాల్లో మొదలైన సందడి.. సిద్ధమవుతున్న ఆశావహులు
- జనవరి 31తో ముగిసిన సర్పంచుల పదవీ కాలం
- జిల్లాలో 396 జీపీలు

జిల్లాలోని మండలాలు	18
గ్రామపంచాయతీలు	396
వార్డు స్థానాలు	3,338



చించోలి బి గ్రామపంచాయతీ కార్యాలయం

నిర్మల్‌చైన్‌గేట్: ఆరు నెలల నెలల్లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతో అంతటా సందడి నెలకొంది. నెల రోజుల విరామం తర్వాత మళ్లీ ఎన్నికల సందడి మొదలు కాబోతోంది. పంచాయతీ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా అనివార్య కారణాలతో ప్రభుత్వం వాయిదా వేసింది. తాజాగా ఈనెల 26న సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. ఓటరు జాబితాను రూపొందించాలని, బీసీ కమిషన్ నివేదికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. దీంతో అందరి దృష్టి పంచాయతీ ఎన్నికలపై పడింది. ఇప్పటికే ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసింది. త్వరలో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం కూడా పూర్తికాబోతోంది. దీంతో స్థానిక సంస్థలన్నింటికీ వరుసగా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

ఆరు నెలలుగా ప్రత్యేక పాలన..

జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు, 3,338 వార్డు స్థానాలు ఉన్నాయి. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగిసింది. ఆరునెలలుగా గ్రామపంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. జీపీల్లో నిధులు నిండుకోవడంతో మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కార్మికుల వేతనాల కోసం నిధులు విడుదల చేయడంతో వాటిని సర్దుబాటు చేశారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సమస్యలతో పల్లె జనం సతమతమవుతున్నారు.

రిజర్వేషన్లపై రాని స్పష్టత..

పంచాయతీ ఎన్నికల నిర్వహిస్తామని సీఎం ప్రకటనకు ముందు నుంచే రిజర్వేషన్లపై ద్వితీయశ్రేణి నాయకుల్లో జోరుగా చర్చలు మొదలయ్యాయి. రిజర్వేషన్లపై బీసీ కమిషన్ నివేదిక గడువులోగానే ఇవ్వాలని సీఎం ఆదేశించడంతో ఏ స్థానం ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తారోనని ఆతృతతో ఎదురు చూస్తున్నారు. బీసీ జనగణన, జనాభా ప్రాతిపదిక తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు ఖరారు చేస్తారని ప్రచారం సాగుతోంది. పాత రిజర్వేషన్లు కొనసాగుతాయా అన్న దానిపై ఎలాంటి స్పష్టత లేదు.

ఆగస్టు నెలాఖరున నోటిఫికేషన్?

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఆగస్టు నెలాఖరులో ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కొన్నింటిని అమలు చేసింది. మరికొన్నింటి అమలుకు చర్యలు చేపట్టింది. ప్రధానమైన రైతు రుణమాఫీ పూర్తయ్యాకే ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో ఉంది. ఇటీవల రూ.లక్షలోపు రుణమాఫీని అమలు చేసిన ప్రభుత్వం.. ఆగస్టు 15వ తేదీలోగా రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలని నిర్ణయించింది.

ఆశావహులు రెడీ..

గ్రామాల్లో తాజా మాజీ సర్పంచ్‌లతోపాటు గత ఎన్నికల్లో ఓడిపోయిన వారు సర్పంచ్ పదవిని దక్కించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సంపన్నులు సర్పంచ్ కావాలన్న పట్టుదలతో ఉన్నారు. ప్రభుత్వం మారడంతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. తమకు సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేలను కోరుతున్నారు.

నేటి నుంచి 'లక్షన్నర మాఫీ'

- లక్షలోపు రుణాలకు రూ.171కోట్లు
- మొత్తం 30,106 మందికి లబ్ధి
- పలు కారణాలతో కొందరికి బ్రేక్



నిర్మల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఈనెల 18 నుంచి రుణమాఫీని అమలు చేస్తోంది. ఒకేసారి రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేయకుండా విడతల వారీగా చేపడుతోంది. ఇందులో ఇప్పటి వరకు రూ.లక్షలోపు రుణాలకు సంబంధించిన మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమచేసింది. ఇక మంగళవారం నుంచి రూ.లక్షన్నర వరకు రుణాలు ఉన్న రైతుల ఖాతాల్లో సంబంధిత మొత్తాన్ని జమచేయనున్నారు. జిల్లాలో ఎంతమంది అర్హులవుతారోనన్న జాబితా మంగళవారం ఉదయం వరకు తెలుస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు.

లక్ష వరకు రుణాల్లో..

ఎన్నికలకు ముందు టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోంది. రూ.లక్షలోపు రుణాల మాఫీలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 30,106 మంది లబ్ధిపొందారు. వీరి ఖాతాల్లో రూ.171 కోట్లు జమ చేశారు. జిల్లాలో మొత్తం లక్షకుపైగా వ్యవసాయ రుణాలను తీసుకున్నట్లు అంచనా. ఇందులో ఎక్కువగా లక్షలోపు రుణాలను తీసుకున్నవారే ఉన్నారు.

రానివారూ ఉన్నారు..

సర్కారు చెప్పినట్లు రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న తమకు మాఫీ కాలేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ ద్వారా బాధిత రైతుల నుంచి వినతులను తీసుకున్నారు. ఆధార్‌కార్డులో లోపాలు, రేషన్‌కార్డులో సభ్యులుగా లేకపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో వీరికి రుణమాఫీ రాకపోవచ్చని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వీరికి సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపించామని, ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

ఆగస్టు నెలాఖరు వరకు

వచ్చే 15లోపు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 18 నుంచి 29వరకు లక్షలోపు రుణమాఫీ చేసిన ప్రభుత్వం 30 నుంచి రూ.లక్షన్నర వరకు రుణాలను మాఫీ చేస్తోంది. ఈలెక్కన ఆగస్టు 15 వరకు ఈ ప్రక్రియ కొనసాగితే.. నెలాఖరు వరకు రూ.2 లక్షల వరకు రుణాలు ఉన్నవారి ఖాతాల్లో మాఫీ డబ్బులు జమ చేసే అవకాశం ఉంది.

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి



ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న తపస్ జిల్లా బాధ్యులు

నిర్మల్‌ఖిల్లా: జీవో 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీయన్.రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయనను జిల్లాలోని 317 బాధిత ఉపాధ్యాయులు తపస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని కలిసి విన్నవించారు. 317 జీవో కారణంగా తాము స్థానికత కోల్పోయామని, తమ కుటుంబాలకు దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం వేసిన సబ్ కమిటీ వేగంగా స్పందిస్తున్నప్పటికీ అధికారులు తాత్సారం చేస్తున్నారని తెలిపారు. గతంలో జరిగిన కేటాయింపుల ఆధారంగా పరిశీలించి త్వరితగతిన స్థానిక జిల్లాలకు పంపించేలా కృషిచేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.రాజేశ్వర్, నాయకులు అజయ్, విఠల్‌రెడ్డి, రవి, ఆర్.రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

భూతగాదాల కేసుపై ఏఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న ఏఎస్పీ అవినాశ్‌కుమార్

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామానికి చెందిన పర్స భోజన్నకు అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్‌తో భూతగాదాలు ఉన్నాయి. పరస్పర దాడిలో తీవ్రంగా గాయపడ్డ పర్స భోజన్న నిర్మల్ పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో లక్ష్మణ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సోమవారం గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారు. ప్రత్యక్ష సాక్షులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం మత్తుపదార్థలపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మత్తుపదర్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విచారణలో ఎస్సై సక్రియానాయక్, ఏఎస్సై దిగంబర్ పాల్గొన్నారు.

మరో 17 మందికి పదోన్నతి

- మిగిలిన ఖాళీలు ప్రమోషన్ల ద్వారా భర్తీ
- కొత్త బడుల్లో చేరిన ఉపాధ్యాయులు



తాజాగా ప్రమోషన్లు పొందినవారు...	
పీఎస్ హెచ్‌ఎం	09
ఎస్‌ఏ సోషల్	04
ఎస్‌ఏ హిందీ	01
ఎస్ ఏ ఉర్దూ	01
ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్	02
మొత్తం	17

నిర్మల్‌రూరల్: జిల్లాలో ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు కల్పించిన తర్వాత, మిగిలిపోయిన ఖాళీలకు రాష్ట్ర విద్యాశాఖ తాజాగా ప్రమోషన్లు కల్పించి భర్తీ చేసింది. జిల్లాలో 17 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు వచ్చాయి. గత నెలలో 433 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లభించిన విషయం తెలిసిందే. అందులో మిగిలిపోయిన సబ్జెక్టుల వారీగా ఖాళీలు, సీనియారిటీ జాబితాను రూపొందించి జిల్లా విద్యాశాఖ రాష్ట్ర విద్యా శాఖకు పంపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తితో ప్రభుత్వం మిగిలిన ఖాళీలకు కూడా ప్రమోషన్లు ఇచ్చింది. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 17 మందికి చాన్స్..

జిల్లా వ్యాప్తంగా 17 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లభించాయి. ఇందులో 09 పీఎస్ హెచ్‌ఎంలు, నలుగురు స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, హిందీ ఒకరు, ఉర్దూ ఒక్కరు, ఫిజికల్ సైన్స్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరందరికీ ఆదివారం అర్ధరాత్రి ఉత్తర్వులు వెలువడగా, సోమవారం ఉదయం కొత్త పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. పాఠశాలల్లో మిగిలిన ఖాళీల విషయమై కొందరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు గత నెలలో పదోన్నతుల ప్రక్రియ పూర్తిన తర్వాత మిగిలిన వాటిని కూడా భర్తీ చేస్తామని ఇటీవల హైకోర్టుకు తెలిపారు. ఈ క్రమంలోనే అందుకు విద్యాశాఖ కసరత్తు చేసి రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన ఖాళీలకు ప్రమోషన్లు కల్పించింది.

ఖాళీలు ఏర్పడ్డాయిలా..

గత నెలలో జిల్లాలో 433 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. కొందరు ఉపాధ్యాయులు రెండు మూడు పోస్టుల్లో ప్రమోషన్లు పొందేందుకు అర్హత కలిగి ఉండడంతో వారు వాటన్నింటికీ ఆప్షన్ ఇచ్చుకున్నారు. ఉదాహరణకు ఒక ఎస్జీటీ టీచర్ బీఏ, బీఈడీ చదివితే ఆయన బీఈడీలో తప్పనిసరిగా రెండు మెథడాలజీలు చదివి ఉన్నందున, స్కూల్ అసిస్టెంట్ రెండు సబ్జెక్టులకు అర్హత పొందుతారు. ఒకవేళ ఆయనకు డీఈడీ కూడా ఉంటే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందేందుకు అర్హత సాధిస్తారు. ఆయన మూడు ఆప్షన్లను ఇచ్చుకుని పీఎస్ హెచ్‌ఎంగా చేరారు. దాంతో రెండు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు తాజా సీనియారిటీ ఆధారంగా ఇలా ఖాళీగా ఉన్న వాటిని ప్రమోషన్ల ద్వారా భర్తీ చేశారు. వెనువెంటనే రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయుల పదోన్నతులపై దృష్టి పెట్టడంతో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మిగిలిన ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీ ద్వారా భర్తీ చేసి, వారికి సెప్టెంబర్ 5న నియామక పత్రాలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎంఈవో బాధ్యతల నుంచి తప్పించాలి

ఖానాపూర్: పెంబి మండలంలో డిప్యూటేషన్ విషయమై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పెంబి ఎంఈవో పదవి నుంచి తప్పించాలని ఖానాపూర్ ఎంఈవో(పెంబి ఇన్‌చార్జి ఎంఈవో) మధుసూదన్ కోరారు. ఈ విషయమై డీఈవోకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల డిప్యూటేషన్ విషయంతో ఆరోపణలు బాధ కలిగించాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ



పురస్కారంతో కీర్తిశ్రీ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాకు చెందిన చిన్నారి జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచింది. జిల్లా కేంద్రానికి చెందిన పడిగెల భారతి, అశోక్ దంపతుల కుమార్తె కీర్తిశ్రీ మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో 'డ్యాన్స్ కా భూకంప్' పేరిట ఆదివారం నిర్వహించిన నృత్యపోటీల్లో శాస్త్రీయనృత్యం ప్రదర్శించి ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపు 600 మందికి పైగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని స్వరూపిణి నృత్య కళాక్షేత్రంలో నాట్య గురువు నవ్య వద్ద శాస్త్రీయ నృత్యంలో శిక్షణ తీసుకుంటోంది. జిల్లాకు చెందిన పలువురు కళాకారులు, నాట్యాభిమానులు చిన్నారిని అభినందించారు.

పోలీసుల అదుపులో యువకుడు?

- గంజాయి విక్రేతగా అనుమానం

బోథ్: మండలంలోని గుట్టపక్కతాండకు చెందిన ఓ యువకుడిని కామారెడ్డి జిల్లాకు చెందిన పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం గ్రామానికి వచ్చిన పోలీసులు ఆ యువకుడిని విచారించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే కామారెడ్డిలో గంజాయి విక్రయించే ఓ వ్యక్తి ఫోన్‌లో గుట్టపక్కతాండకు చెందిన యువకుడి ఫోన్ నంబర్ ఉండటంతో పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ యువకుడి వద్ద గల ఫోన్‌లో పలువురి నంబర్లు గంజాయి పేరుతో కలిసి ఉండటంతో పోలీసులకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయమై స్థానిక ఎస్సై రామును వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఇతర జిల్లా పోలీసులు యువకుడిని తీసుకెళ్లడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



పగిలిన బస్సు ముందు టైరు

నేరడిగొండ: ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టైర్ నేరడిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద పగిలిపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును పక్కకు నిలిపివేశాడు. ఏ చిన్నపాటి గాయాలు సైతం కాకుండా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

ప్రజల చెంతకే 'పోస్ట్'

- తపాలా కార్యాలయాల్లో అన్ని సేవలు
- ప్రతీ పంచాయతీలో బ్రాంచులు
- బ్యాంకులను మించి సేవలు
- పింఛన్, కరువు డబ్బులే అనుకుంటున్న గ్రామీణులు
- ఇక్కడ పొదుపుచేస్తే అధిక వడ్డీలు
- టర్మ్‌పాలసీలతో కుటుంబాలకు అండ



ఈ ఫొటోలో చెక్కు అందుకుంటున్న మహిళ పేరు అల్లకుంట మౌనిక. నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలం రాంపూర్‌కు చెందిన మౌనిక భర్త శ్రీనివాస్ పోస్ట్ ఆఫీస్‌లో రెండేళ్ల క్రితం టర్మ్ పాలసీ తీసుకున్నాడు. గతేదాది గుండంపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో శ్రీనివాస్ మృతి చెందాడు. దీంతో పోస్టల్ అధికారులు మౌనికకు టర్మ్‌పాలసీ కింద మంజూరైన రూ.10 లక్షల బీమా చెక్కును అందజేశారు.

భైంసా/దండేపల్లి:దేశంలోనే అతి పెద్ద నెట్‌వర్క్‌గా పనిచేస్తున్న పోస్టల్ శాఖ నాలుగైదేళ్లుగా అనేక పథకాలను ప్రవేశపెట్టింది. రోడ్డు ప్రమాదాలు, అనుకోకుండా జరిగే ప్రమాద ఘటనల్లో చాలా మంది జీవితాలు అర్ధాంతరంగా ముగుస్తున్నాయి. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మరణిస్తే ఆకుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వాలు కొన్ని ప్రమాద బీమా పథకాలను అమలులోకి తెచ్చాయి. వాటిల్లో తపాల ప్రమాద బీమా పథకాలు ఉన్నాయి. అందులో రూ.10 లక్షలు, రూ.15 లక్షలు పరిహారంగా అందిస్తున్నాయి. తపాల బీమా పథకాలపై 'సాక్షి' అందిస్తున్న కథనం.

పథకాలపై అవగాహన

పోస్టల్ శాఖ ప్రవేశపెడుతున్న పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా డాక్‌చౌపాల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఏర్పాటు చేయనున్నారు. పోస్టల్ సిబ్బంది గ్రామగ్రామానికి వెళ్లి పోస్టాఫీసులో అందుబాటులో ఉండే సేవలను ప్రజలకు వివరించనున్నారు. వారితో ఖాతాలు తీయించి పొదుపు చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు.

బీమాకు ఎవరు అర్హులు?

తపాల ప్రమాద బీమా తీసుకునేందుకు 18 నుంచి 65 ఏళ్ల వయస్సు వారు అర్హులు, ఆధార్ కార్డుతో తపాల కార్యాలయానికి వెళ్లి రూ.200 చెల్లించి ఖాతా తెరవాలి. రూ.549 లేదా 749తో బీమా చేసుకోవచ్చు. ఇది ఏడాదిలో ఒక్కసారి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. రూ.549 చెల్లిస్తే రూ.10 లక్షలు, రూ.749 చెల్లిస్తే రూ.15 లక్షల ప్రమాద బీమా డబ్బులు బాధిత కుటుంబానికి అందుతాయి. రోడ్డు ప్రమాదాల్లో చికిత్స పొందితే రూ. 60వేల వరకు ఆసుపత్రి బిల్లులు పొందవచ్చు. ప్రమాదవశాత్తు ఎముకలు విరిగితే రూ.లక్ష వరకు బిల్లులు పొందవచ్చు. ఈ టర్మ్‌పాలసీలు చాలా మందికి తెలియక నష్టపోతున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	నియోజకవర్గాలు	మండలాలు	సబ్ పోస్టాఫీసులు	బ్రాంచ్ పోస్టాఫీసులు
ఆదిలాబాద్	ఆదిలాబాద్, బోథ్	18	14	106
నిర్మల్	ఖానాపూర్, ముథోల్, నిర్మల్	19	15	117
మంచిర్యాల	మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్	18	24	141
కుమురంభీం	ఆసిఫాబాద్, సిర్పూర్	15	9	100

క్షణాల్లో సేవలు అందిస్తాం



పోస్టాఫీసుల్లో అన్ని రకాల సేవలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉంటారు. పోస్టాఫీసుల్లో అనేక పథకాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉపాధి హామీ, ఆసరా పింఛన్ డబ్బులే కాకుండా అనేక సేవలు అందుతాయి. ప్రజలంతా పోస్టాఫీసుకు వెళ్లి అవసరం ఉన్న ఖాతాలు తెరిచి పొదుపు చేసుకోవాలని కోరుతున్నాం. ఊరూరా సుఖన్య సమృద్ధి యోజన పథకాలు చేయిస్తున్నారు. బీమా పాలసీలు, వెహికిల్ ఇన్సూరెన్స్ పొందవచ్చు.

– జే.దిలీప్‌కుమార్, సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫీసేస్, భైంసా

మరిన్ని పథకాలు...

- బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ ఏటీఎం, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలు అందించే సేవింగ్ బ్యాంక్ పథకం (ఎస్‌బీ)
- స్వల్ప కాలిక అవసరాల కోసం నెలనెలా పొదుపు చేసుకునే రికరింగ్ డిపాజిట్ పథకం (ఆర్‌డీ)
- ఆడపిల్లల బంగారు భవిష్యత్‌కోసం సుకన్య సమృద్ధి యోజన పథకం (ఎస్ఎస్‌ఏ)
- అబ్బాయిల ఉన్నత చదువులకు, ఇతర అవసరాలకు అందరికీ ఉపయోగపడే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) పథకం
- ఒకటి నుంచి ఐదు సంవత్సరాల కాలపరిమితితో ఎక్కువ వడ్డీ అందించే టైం డిపాజిట్ పథకం (టీడీ)
- రిటైర్డ్ ఉద్యోగులకు, 60 సంవత్సరాలు దాటిన వారికి ఎక్కువ వడ్డీ రేటుతో మూడు నెలలకు ఒకసారి వడ్డీ అందించే సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీం పథకం (ఎస్‌సీఎస్ఎస్)
- నెలనెలా వడ్డీ పొందాలనుకునే వారికోసం మంత్లీ ఇన్కమ్ స్కీమ్ (ఎంఐఎస్)
- మహిళల సాధికారత కోసం రెండు సంవత్సరాల కాల పరిమితితో ఎక్కువ వడ్డీ అందించే మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)
- ఆదాయ పన్ను సడలింపు కోసం తీసుకునే నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం (ఎన్ఎస్‌సీ)
- నగదును రెట్టింపు చేసే కిసాన్ వికాస్ పత్ర్ పథకం (కేవీపీ)
- బీమా రంగంలో అతి తక్కువ ప్రీమియంతో అత్యధిక బోనస్‌తో కుటుంబ సభ్యులకు సంపూర్ణ భద్రత కల్పించే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ తపాల జీవిత బీమా (పీఎల్ఐ,ఆర్‌పీఎల్ఐ)
- ఆధార్ అనుసంధానంతో ఖాతా కలిగి ఉన్న బ్యాంకు నుండి నగదు విత్ డ్రా చేసుకోవడానికి ఆధార్ ఎనబెల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) సౌకర్యం కలదు
- అతి తక్కువ ప్రీమియంతో రూ.550 నుంచి రూ.755 చెల్లిస్తే రూ.10 నుంచి రూ.15 లక్షల ప్రమాద బీమా కల్పించే పాలసీలు
- వెహికల్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్, టర్మ్ పాలసీ సేవలు, అన్ని రకాల లెటర్, పార్సిల్ బుకింగ్ సేవలు, స్పీడ్ పోస్ట్ బుకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

లంబాడాలను కించపర్చొద్దు



మాట్లాడుతున్న జగన్ నాయక్

ఉట్నూర్‌రూరల్: కొందరు ఆదివాసీ నాయకులు లంబాడా గిరిజనులను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని లంబాడా జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ నాయక్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1976లో జీవో 108 ప్రకారం అప్పటి కేంద్ర ప్రభుత్వం గిరిజనులుగా గుర్తించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రిజర్వేషన్ సౌకర్యం కల్పించిందన్నారు. లంబాడాలు ఎలాంటి అడ్డదారిలో రాలేదని, రాష్ట్రపతి ఆమోదంతో రాజ్యాంగ బద్ధంగానే వచ్చామన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు గోపాల్‌రావు నాయక్, మోహన్‌సింగ్ నేతావత్ రాందాస్, రాథోడ్ రమేశ్, కిషన్ నాయక్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి భోజనమే ముద్దు..



జెడ్పీ సమావేశ మందిరంలో భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన గురువందనం కార్యక్రమానికి హాజరయ్యారు. సమావేశం అనంతరం హోటల్‌కు వెళ్లకుండా తన ఇంటి నుంచే తీసుకొచ్చిన లంచ్ బాక్స్ తెరిచి భోజనం చేయడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. తాను ఏ కార్యక్రమానికి వెళ్లినా కార్యక్రమ నిర్వాహకులపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో భోజనంతో పాటు తాగునీరు వెంట తెచ్చుకుంటానని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి
- జెడ్పీలో ఘనంగా గురువందనం



డైట్ వైస్ ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, సంఘ బాధ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, గురువులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువందనం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులపై ఉన్న చిన్నచూపు పోగొట్టేలా వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2.91 లక్షల కోట్ల నిధులు కేటాయిస్తే విద్యారంగానికి కేవలం రూ.21వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏలు, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. అంతకుముందు ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా నిలువాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంత్‌రావు, సురేశ్, ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివ కుమార్, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, గోపీకృష్ణ, డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శునకానికి అంత్యక్రియలు

తలమడుగు: అల్లారు ముద్దుగా పెంచుకున్న శునకం (లియో) అనారోగ్యంతో మృతి చెందడంతో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి మాట్లాడుతూ పదహారేళ్ల నుంచి అల్లారుముద్దుగా పెంచుకున్నామని, కుటుంబంలో సభ్యుడిగా ఆదరించామన్నారు. వ్యవసాయ పొలంలో సమాధి ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమంలో కారోబార్ సంజీవ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రమేశ్‌రెడ్డి, వెంకన్న యాదవ్, జి.శ్రీనివాస్ రెడ్డి, ఎం.గంగాధర్, వెంకటేష్, ప్రవీణ్ రెడ్డి, దివాకర్, సాంబశివ్, సంజీవ్‌రెడ్డి, ఎం వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, భూమారెడ్డి, బాలాజీ, రావుల నారాయణ, రాకేష్, మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో నివాసం ఉంటున్న రవీంద్ర గౌడ్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రవీంద్ర గౌడ్ ఇంటికి మరమ్మతులు చేయిస్తుండగా ఇదే క్రమంలో అదే కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో భద్రపర్చిన తులం బంగారం, రూ.5వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రకృతి ఒడిలో పొచ్చెర అందాలు

- కనువిందు చేస్తున్న జలపాతం సోయగాలు
- పెరుగుతున్న పర్యాటకులు



పొచ్చర జలపాతం వద్ద వనదేవత విగ్రహం



పొచ్చర జలపాతాన్ని వీక్షిస్తున్న పర్యాటకులు

బోథ్: పొచ్చర జలపాతం అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో జలపాతానికి నీటి ప్రవాహం పెరిగింది. దీంతో జలపాతం వద్ద పెద్ద బండరాళ్లపై పడుతున్న నీరు, వచ్చే నీటి తుంపరులు వీక్షకులకు కనువిందు చేస్తున్నాయి. జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు.

ఆహ్లాద వాతావరణం..

పొచ్చర జలపాతం అందాలు, పచ్చని వాతావరణం పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. జలపాతాన్ని చూడటంతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం వచ్చిన పర్యాటకులు వీకెండ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. దీంతో పొచ్చెర జలపాతం మంచి పిక్నిక్ స్పాట్‌గా ఏర్పడింది. జలపాతం వద్ద ఏర్పాటు చేసిన గంగాదేవి, వన దేవత విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. పర్యాటకులు విగ్రహాలతో ఫొటోలు తీసుకుంటున్నారు.

'పొచ్చర'కు ఇలా చేరుకోవాలి..

బోథ్ మండలంలోని పొచ్చర జలపాతానికి నిర్మల్ నుండి వచ్చే వారు జాతీయ రహదారి 44పై నేరడిగొండ మండల కేంద్రం మీదుగా రావాలి. నేరడిగొండ నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఎడమ వైపు బోథ్ ఎక్స్ రోడ్డు ఉంటుంది. ఎడమ వైపు తిరిగి అక్కడి రోడ్డు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే కుడివైపు పొచ్చర జలపాతానికి దారి వస్తుంది. కిలో మీటరు దూరంలో జలపాతానికి చేరుకోవచ్చు. ఆదిలాబాద్ నుంచి వచ్చే వారు 44వ జాతీయ రహహదారిపై ఆదిలాబాద్ నుంచి 45 కిలోమీటర్లు ప్రయాణించి బోథ్ ఎక్స్ రోడ్డు కుడివైపు రావాలి. అక్కడి రోడ్డు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే కుడివైపు జలపాతానికి దారి వస్తుంది. అక్కడి నుంచి కిలోమీటరు దూరంలో జలపాతానికి చేరుకోవచ్చు.

సహజసిద్ధమైన అందాలు



పొచ్చర వద్ద సహజ సిద్ధమైన అందాలు బాగున్నాయి. జలపాతం వద్ద బండరాళ్లపై నీరు జారిపడినప్పుడు వచ్చే శబ్దాలు వినసొంపుగా ఉన్నాయి. పచ్చని వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. కూర్చోవడానికి కుటీరాలు ఏర్పాటు చేశారు. కుటుంబంతో వచ్చి చూడాల్సిన ప్రాంతం ఇది.

– గోపిడి రమేశ్‌రెడ్డి, జగిత్యాల

ఆహ్లాదకరంగా ఉంది



నేను వరంగల్ నుంచి వచ్చా. జతపాతం అందాలు చాలా బాగున్నాయి. ఆహ్లాదకరంగా ఉంది. వీకెండ్‌లో ప్రతి ఒక్కరూ చూడాల్సిన ప్రాంతం. ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకులు పెరిగే అవకాశం ఉంటుంది. ఈ వర్షాకాలంలో మా కుటుంబంతో మళ్లీ వచ్చి చూస్తాం.

– ప్రియాంక, వరంగల్

జలపాతాల్లో జల్సాలు




జలపాతం నడి మధ్యలో మందు బాటిల్‌తో చిందులేస్తున్న యువకుడు

వాస్తాపూర్ జలపాతంలో మద్యం సేవిస్తూ చిందులేస్తున్న యువకులు



జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలపాతాలు పరుగులు పెడుతున్నాయి. ప్రకృతి రమణీయతను ఆస్వాదించేందుకు పర్యాటకులు వెళ్తుండగా జలపాతాల సమీపంలో మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. కొంతమంది యువకులు మందు బాటిళ్లతో జల్సాలు చేస్తూ పర్యాటకులను ఇబ్బందులు గురి చేస్తున్నారు. ఫ్యామిలీతో వచ్చి ఎంజాయ్ చేయాలనుకుంటే మందుబాబులను చూసి ఇదేం కర్మరా బాబు అంటూ కొందరు వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. పర్యాటక, పోలీసుశాఖల అధికారులు స్పందించి జలపాతాల వద్ద మద్యం సేవించకుండా చర్యలు చేపట్టాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



వాస్తాపూర్ జలపాతం పక్కనే మద్యం సేవిస్తున్న యువకులు



వాస్తాపూర్ జలపాతంలో మందు బాటిళ్లతో యువకులు



వాస్తాపూర్ జలపాతంలో మందు తాగుతూ సేదతీరుతున్న యువకుడు